

ఒక్క క్షణంలో.. అంతా శూన్యం

చిన్న సమస్యను అధిగమించలేక క్షణికావేశంలో చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వివరాలు 8లో ▸



మీరెందుకు నివసించడం లేదు

డబుల్ బెడ్‌రూంలు మంజూరైన లబ్ధిదారులు నివాసం ఉండకపోవడంతో అధికారులు నోటీసులు జారీచేశారు. వివరాలు 8లో ▸



పాఠశాల నిర్వహణపై..

ఝరాసంగంలోని కేజీబీవీ పాఠశాల నిర్వహణపై జిల్లా అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రెడ్‌కో చైర్మన్‌ను కలిసిన రమేశ్ చౌహాన్



శరత్‌కు మొక్క అందజేస్తున్న రమేశ్ చౌహాన్

నారాయణఖేడ్: తెలంగాణ రెడ్కో నూతన చైర్మన్‌గా నియమితులైన డా.శరత్ నాయక్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రమేశ్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట సంఘం నాయకులు చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలి: డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, గండిగూడ ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన తీరును తరగతి గదిలోకి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ పరితోశ్



సంగారెడ్డి జోన్: ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండి రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న కక్షిదారులకు ఈ లోక్‌అదాలత్ మంచి అవకాశమని తెలిపారు. వీలైనన్ని ఎక్కువ కేసులు లోక్‌అదాలత్‌లో రాజీ పడేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అల్గోల్ గురుకుల విద్యార్థులు



ఫస్ట్ ప్రైజ్ సాధించిన అల్గోల్ వాలీబాల్ జట్టు

జహీరాబాద్ టౌన్: 69వ మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడల్లో అల్గోల్ మైనార్టీ గురుకుల విద్యార్థులు సత్తా చాటి ప్రతిభ కనబరిచారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ -14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించగా మూడు విభాగాల్లోనూ అల్గోల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ జె.రాములు తెలిపారు. గురుకులం నుంచి 26 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఖలీల్, పీఈటీ అనిల్‌కుమార్, పీడీ.ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లో యువతకు ప్రాధాన్యం: నరేశ్‌గౌడ్

జహీరాబాద్: త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో 20% కోట యువతకు కేటాయించాలన్నారు. అన్ని ఎన్నికల్లో యువత క్రియాశీలకంగా వ్యవహరిస్తుందన్నారు. నిర్మలారెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గం అధ్యక్షుడు నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు నరేశ్ యాదవ్, వసీం, ప్రధాన కార్యదర్శులు అక్బర్, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఐదు నిమిషాల్లోనే..

కూలిన హాస్టల్ పైకప్పు • తృటిలో తప్పిన ప్రమాదం • ముగ్గురు విద్యార్థులకు గాయాలు

లంచ్‌టైమ్ కావడంతో భోజనం కోసం విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వచ్చారు. అలా వెళ్లిన ఐదు నిమిషాల్లోనే ఆ హాస్టల్ పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. అదేసమయంలో పిల్లలు గనుక హాస్టల్లోనే ఉండుంటే మాటలకందని విషాదం జరిగిపోయేది.

మునిపల్లి(అందోల్):

హాస్టల్ విద్యార్థులకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని లింగపల్లి గురుకుల పాఠశాల హాస్టల్ పైకప్పు (స్లాబ్) మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. పైకప్పు కూలిన సమయంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టైంది. పెను ప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో రవిందర్ అనే ఆరోతరగతి విద్యార్థి తలకు గాయాలు కావడంతో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా చికిత్స చేసి పంపించేశారు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గోడలు పడిపోవడంతో పైకప్పు ఒక్కసారిగా కూలిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే: క్రాంతికిరణ్

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, హాస్టళ్లు, స్కూళ్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు.

కొత్త భవన నిర్మాణానికి రూ.6 కోట్లు

కాగా సమాచారం అందుకున్న మంత్రి దామోదర అధికారులతో కలసి ఘటనా స్థలికి చేరుకుని హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. హాస్టల్ భవనం కొత్త నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. భవన నిర్మాణం, మౌలిక వసతులపై ప్రణాళికలివ్వాలని అధికారులను ఆదేశించారు.



కూలిన హాస్టల్ పైకప్పు

బాధితులకు న్యాయం జరగాలి

- సిగాచిపై రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ప్రొఫెసర్ కోదండరామ్
- బాధిత కుటుంబ సభ్యుల సమస్యలు చెబితే సీఎం దృష్టికి తీసుకువెళ్తా
- ప్రకటించిన పరిహారం త్వరగా చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పటాన్‌చెరు టౌన్: సిగాచి పరిశ్రమ బాధితులకు న్యాయం జరగాలని, ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ ముత్తంగిలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో టీపీజేఏసీ కన్వీనర్ అశోక్ కుమార్, సైంటిస్ట్ ఫర్ పీపుల్స్ వ్యవస్థాపకులు బాబూరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు మేధావులు, వక్తలు, బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘం నాయకులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ బాధలను పంచుకున్నారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ...సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం చాలా దురదృష్టకరమన్నారు. యాజమాన్య తప్పిదం తోనే ప్రమాదం జరిగినట్లు నిపుణులు చెప్తున్నారని తెలిపారు. పోలీసులు యాజమాన్యంపై కేసు నమోదు చేసినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం సరి కాదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై కేసులు పెట్టి దొరికిన వారిని అరెస్టు చేసిన ప్రభుత్వాలు ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యాలపై మరొకలా వ్యవహరించడం ఏం నీతని నిలదీశారు. కార్మికుల సజీవ దహనానికి కారణమైన యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలతోపాటు పౌర సమాజం ఈ ప్రమాదం నుంచి గుణ పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నిర్మాణాత్మక శైలిలో నిబంధనలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్మిక సంఘాలతోపాటు నిపుణులు, మేధావులు ఒకతాటిపై వచ్చి ప్రణాళిక సిద్ధం చేసి సీఎంను కలిసి వివరిద్దామని తెలిపారు. సంఘటన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారంతోపాటు గాయపడిన క్షతగాత్రులకు రూ.పది లక్షల పరిహారం ప్రకటించారని వెంటనే ఆ పరిహారాన్ని చెల్లించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ధూళితోనే ఇంత పెద్ద ప్రమాదం: బాబూరావు

సిగాచి పరిశ్రమ నిర్లక్ష్యం, కాలం చెల్లిన మెషీనరీతో అవగాహన లేని కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించడం, పరిశ్రమలో తయారుచేసే మిశ్రమం నుంచి వచ్చిన ధూళితోనే ఇంత పెద్ద ప్రమాదం సంభవించిందని సైంటిస్ట్ ఫర్ పీపుల్స్ వ్యవస్థాపకులు బాబూరావు తెల్పిచెప్పారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు రూ.కోటితో పాటు గాయపడ్డ క్షతగాత్రులకు రూ.పదిలక్షల నష్టపరిహారం ప్రకటించినా ఇప్పటివరకు కార్మికులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదన్నారు. పక్క రాష్ట్రంలో ప్రమాదం జరిగిన వారం రోజుల్లోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.కోటి, గాయపడ్డ వారికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తే తెలంగాణలో మాత్రం కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అడ్వొకేట్ వసుదా నాగరాజు సహకారంతోనే హైకోర్టులో పిల్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో బాధితులందరికీ న్యాయం జరిగే వరకూ విశ్రమించేది లేదని తేల్చి చెప్పారు. పరిశ్రమల్లో కార్మిక భద్రత గురించి ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ రవీందర్ ఆకస్మిక బదిలీ

- ఇన్‌చార్జిగా ఆందోల్ ఆర్డీఓ పాండుకు బాధ్యతలు
- పలు భూ వివాదాలే కారణమా?



రవీందర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. ఆయనను ఆకస్మికంగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీ ఇప్పుడు రెవెన్యూశాఖతో పాటు, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఆందోల్ ఆర్డీఓగా పనిచేస్తున్న పాండుకు సంగారెడ్డి ఆర్డీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రవీందర్‌రెడ్డికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రవీందర్‌రెడ్డి చాలా కాలంగా సంగారెడ్డి జిల్లాలో పాతుకుపోయారు. గత బీఆర్‌ఎస్ హయాంలో కూడా ఆయన సంగారెడ్డి ఆర్డీఓగా పనిచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఆయనను జహీరాబాద్ నిమ్జ్ భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా లూప్‌లైన్ పోస్టుకు బదిలీ చేశారు. అక్కడ కొద్దిరోజులే పనిచేసిన రవీందర్‌రెడ్డి తిరిగి సంగారెడ్డి ఆర్డీఓగానే పోస్టింగ్ తెచ్చుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. సుమారు పది నెలలుగా ఆర్డీఓగా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డిని ఇప్పుడు ఆకస్మికంగా బదిలీ చేయడం జిల్లా అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తన బదిలీని నిలిపివేసుకునేందుకు రవీందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం రెవెన్యూశాఖ వర్గాల్లో జరుగుతోంది. ఇందుకోసం జిల్లాలోని అధికార కాంగ్రెస్ పార్టీలోని కీలక ప్రజాప్రతినిధులను, నేతలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో..

జిల్లాలో రూ.వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. నేతలు, ప్రజాప్రతినిధుల బినామీలు ఈ భూములను చెరబట్టారు. మరోవైపు వందలాది ఎకరాల్లో అసైన్డ్ భూములు చేతులు మారాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రధానంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాలు..పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట వంటి మండల్లాలో విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలోనూ ఆయన సంగారెడ్డి ఆర్డీఓగా చాలాకాలం పనిచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఆయనకు బదిలీ జరిగినా తిరిగి సంగారెడ్డి ఆర్డీఓ పోస్టుకే చేరుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని కీలక పోస్టింగ్‌లను దక్కించుకుంటారనే విమర్శలు రవీందర్‌రెడ్డిపై ఉన్నాయి.

పైరవీకారులకు నిలయం!

సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం పైరవీకారులకు నిలయంగా మారిందనే విమర్శలున్నాయి. సాధారణ ప్రజలు, నిరుపేద రైతులు తమ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తే కనీసం పట్టించుకోని ఈ కార్యాలయం అధికారులు, పైరవీకారులకు మాత్రం పెద్ద పీట వేస్తారనేది సాధారణ విషయమేననే అభిప్రాయం ఉంది. బడాబాబులు, రియల్ ఎస్టేట్ కంపెనీల పనులను వెంట వెంటనే చేసి పెట్టే ఈ అధికారులు, సాధారణ రైతులను, నిరుపేదలను మాత్రం చెప్పులరిగేలా తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

కాళోజీ ఆలోచనలు యువతకు ఆదర్శం



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



ఎస్పీ కార్యాలయంలో జరిగిన వేడుకలో పోలీసులు

సంగారెడ్డి జోన్: తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణరావు ఆలోచనలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని డీఆర్‌ఓ పద్మజారాణి పేర్కొన్నారు. మంగళవారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఇక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాళోజీ చిత్రపటానికి ఏఆర్ డీఎస్పీ నరేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టాలు

సంగారెడ్డి టౌన్: న్యాయవాదులకు రక్షణ చట్టాలు కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదురుగా మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్‌లో సురేశ్‌బాబుపై, ఖమ్మంలో జహీర్‌అలీపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయం కోసం పోరాడే తమపై ఎలాంటి దాడులు జరగకుండా వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

భూములు బలవంతంగా తీసుకోవద్దు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ ప్రాజెక్టు కోసం రైతుల భూములను బలవంతంగా తీసుకోవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో సోమవారం నిమ్జ్ భూబాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రూ.కోటి వరకు ధర పలికే భూములను ప్రభుత్వం ఎకరాకు రూ.15 లక్షలే చెల్లిస్తుందన్నారు. నిమ్జ్ కోసం ఇప్పటికే వేల ఎకరాల భూమిని సేకరించిన ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ వేసిందని, బలవంతపు భూసేకరణకు నిరసనగా ఈ నెల 12న భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.కుమార్, బి.నర్సింలు, తుల్జరాం, సంగన్న రైతులు పాల్గొన్నారు.



నీరు లేని కాలువలు

గండ్లు పూడ్చరేం..?

సింగూరు ఆయకట్టు రైతుల సాగు ఇక్కట్లు

పుల్‌కల్(అందోల్): ఇటీవల భారీ వర్షాల కారణంగా తెగిపడ్డ పంటకాలువలు, యూరియా కొరతతో రైతులు కష్టాలనెదుర్కొంటున్నారు. ఈ కష్టాలకు తోడు ఈ ఏడు వానాకాలం నుంచి సింగూరు సాగునీరు వస్తాయా లేదోనని ఎదురుచూసిన రైతులకు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా సింగూరు కాలువకు పడ్డ గండ్లు రైతుల్ని మరింత కుంగదీస్తున్నాయి.

రైతులకు ఊహించని షాక్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బస్వాపూర్ చెరువు అలుగు పారి నీరు కాలువలోకి రావడం, మిన్‌పూర్ వద్ద కాలువకు బుంగపడి ఆ నీరంతా చెరువులోకి వెళ్లి అలుగు పారడంతో దిగువన వరిచేలు మునిగిపోయాయి. ఇసోజిపేట వద్ద ఫారెస్టు నీళ్లు కాలువలోకి చేరి ప్రవాహ ఒత్తిడి పెరగడంతో అక్కడ మరో గండి పడి నీరంతా ఫారెస్టు నుంచి మంజీరా నదికి చేరాయి. దీంతో సాగునీటిని నిలిపివేయడంతో రైతులకు ఊహించని షాక్ తగిలింది.

ఆది నుంచి అంతే

వానాకాలం ప్రారంభం నుంచి సింగూరు కాలువలకు సిమెంట్ లైనింగ్ పేరుతో కాలయాపన చేశారు. వానాకాలం ప్రారంభమై రెండు నెలలైనా సిమెంట్ లైనింగ్ ప్రారంభం కాలేదు. అలాగే సాగు నీరు విడుదల చేయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక నాయకత్వానికి ఇబ్బంది కలుగుతుందని భావించి కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదరను సంప్రదించి సిమెంట్ లైనింగ్ పనులు ఆపించి వరినాట్లకు నీటిని వదిలారు.

ట్రాక్టర్‌పై వెళ్లి గండ్లను పరిశీలించినా..

భారీ వర్షాలు కురుస్తున్నప్పుడే మంత్రి దామోదర రాజనర్సింహ రహదారులు బాగోలేకపోయినా ట్రాక్టర్‌పై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పంకజ్ పరితోశ్, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి వెళ్లి మరీ తెగిపడ్డ గండ్లను పరిశీలించారు. అక్కడే గండ్లను పూడ్చాలని ఆదేశించారు. ఈ ఘటన జరిగి 25 రోజులు కావొస్తున్నా గండ్లను పూడ్చలేకపోయారు. స్వయంగా మంత్రే ఆదేశించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గండ్లను పూడ్చి సాగునీటిని సరఫరా చేయాలని రైతులు కోరారు.

జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ కేంద్రాలు

డే కేర్ సెంటర్ల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర

- త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ వాహనాలు
- డాక్టర్ నోరి దత్తాత్రేయ అడ్వైజర్‌గా క్యాన్సర్ నిర్మూలన కార్యక్రమం



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర. చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మరో ముందడుగు వేసిందని, క్యాన్సర్ వ్యాధి చికిత్సను ప్రజలకు చేరువ చేసేందుకు అన్ని జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ప్రారంభం ద్వారా ఆ వ్యాధిపై పోరాటానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి వైద్య ఆరోగ్య కళాశాల నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ...ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో వ్యాధి నిర్ధారణలోనూ, చికిత్స అందించడంలోనూ జరిగే జాప్యం కారణంగానే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇకమీదట అలా జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నిర్మూలన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమానికి అడ్వైజర్‌గా రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయను నియమించిందని వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి నియంత్రణలో ఆయన తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్న నమ్మకాన్ని మంత్రి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్లలో రోగులకు సమయానుకూల స్క్రీనింగ్ పరీక్షలు, రేడియేషన్, పాలియేటివ్ కేర్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాలలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ వాహనాలను సైతం అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిమ్స్, ఎస్‌ఎంజే ఆస్పత్రులలో 80 పడకల క్యాన్సర్ ప్రత్యేక విభాగాలు కొనసాగుతున్నాయని, త్వరలో వరంగల్, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషల శిక్షణకు ఒప్పందం

రాష్ట్రంలో ప్రతి ఏటా 3,000 మంది నర్సింగ్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు మంత్రి దామోదర తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, ఇంగ్లిష్‌లతోపాటు పలు విదేశీ భాషల్లో శిక్షణనివ్వడం కోసం ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)తో వైద్య ఆరోగ్యశాఖ ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందం వల్ల నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై పట్టు సాధించేలా ఇఫ్లూ అధ్యాపకులు శిక్షణనిస్తారని వెల్లడించారు. ఈ శిక్షణతో నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చోగ్తూ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్రకుమార్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రకుమార్, అదనపు డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ ఆఫ్ ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వైద్య కళాశాల అధ్యాపకులు, జీజీహెచ్ సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒక్క క్షణంలో.. అంతా శూన్యం!

- చిన్న కారణాలతో యువత బలవన్మరణం
- జిల్లాలో నెలకొకరు చొప్పున ఆత్మహత్య
- మానసిక స్థితిని గమనించి, ధైర్యం చెప్పాలి
- మానసిక నిపుణుల సూచన



సంగారెడ్డి క్రైమ్: చిన్న సమస్యను అధిగమించలేక కొంత మంది యువత ఒక క్షణం ఆలోచించకుండా ఉరి తాడును వెతుక్కతున్నారు. క్షణికావేశంతో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చిన్న కష్టాన్ని కూడా తట్టుకోలేక పురుగుల మందు తాగి అసువులు బాసుతున్నారు. అప్పులు, కుటుంబ సమస్యలు, మోయలేని చదువు భారం, ఉద్యోగం రాలేదని నిరుద్యోగి, ప్రేమ విఫలమైందని, టీచర్, తల్లిదండ్రులు మందలించారని ఇలా అనేక మంది చిన్నచిన్న కారణాలతో జిల్లాలో ఎక్కడో చోట నెలకొక్కరూ ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో చిన్న చిన్న కారణాలకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువతీ యువకులు క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయం కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. ప్రతి మనిషికి ఏదో ఒక సమస్య ఉంటుంది. ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించుకోవాలి. ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదని నిపుణులు అంటున్నారు.

కుటుంబం, సన్నిహితుల బాధ్యత ఇది

తమ కుటుంబ సభ్యులు, లేదా స్నేహితులతో చర్చిస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి. కానీ అవేమీ ఆలోచించకుండా చాలామంది చావు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీంతో వారి జీవితం అర్ధంతరంగా ముగిసిపోతుంది. వారిపై ఆధారపడిన పిల్లలు తల్లిదండ్రులు భార్య రోడ్డున పడుతున్నారు. భార్యాభర్తల్లో ఒకరు లోకం వీడితే రెండో వ్యక్తి కుంగుబాటుకు గురవుతారు. వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలి. ఎవరైనా తాను బతకనని, కుటుంబానికి బరువయ్యా అని చెబితే తేలికగా తీసుకోవద్దు.

నువ్వులేని ఇంటిని జీవితాన్ని ఊహించుకోండి అంటూ చాలామంది మానసిక వేదనను వెలిబుచ్చుతారు. వారిని మార్చే దిశగా ప్రయత్నం చేయకపోతే కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే.. వ్యాయామం అలవాటు చేయడం ద్వారా కొంత మార్పు ఉంటుంది. సంగారెడ్డి జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లో దాదాపు 140 మంది వివిధ కారణాలతో తమ ప్రాణాలు తీసుకున్నారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన మహిళ మే నెల 29న ఆత్మహత్య చేసుకుంది. తన తల్లి మందలించిందని క్షణికావేశంలో బలవన్మరణానికి పాడింది. దీంతో ఆమె ఐదేళ్ల పాప అనాథ అయ్యింది. అలాగే.. పుల్కల్ మండలానికి చెందిన యువకుడు కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా జిల్లాలో రోజుకొకి బలవన్మరణం ఎక్కడో ఒక చోట చోటుచేసుకుంటోంది.

ఇలా అరికట్టవచ్చు..

వైద్యనిపుణుల ప్రకారం.. ఆత్మహత్యకు పాల్పడాలనుకునేవారు ఒంటరిగా ఉంటారు. వెంటనే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చు. డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు స్పందిస్తారు. మహిళల కోసం 181కు కాల్ చేస్తే సఖీ కేంద్రం సిబ్బంది ఇంటికొచ్చి కౌన్సెలింగ్ ఇస్తారు. పిల్లలకైతే 1098కి సమాచారం ఇవ్వాలి.

మానసిక వైద్యుడిని సంప్రదించాలి



సంపాదన కోసం అంటూ బిడ్డలకు దూరం కావడం వారిపై మానసిక ప్రభావాన్ని చూపుతుంది. పిల్లలు ఏది అడిగితే అది కొనివ్వడం సమర్థించ దగ్గ పరిణామం కాదు. ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నారని సన్నిహితులు గుర్తిస్తే వారిలో ధైర్యం నింపాలి. ఆత్మహత్యలకు ఎన్నో కారణాలు ఉంటాయి. తీవ్రంగా ఆలోచిస్తున్న వారిని మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్తే సమస్యల గుర్తించి తగ్గిన చర్యలు తీసుకుంటారు.

–సతీష్, మానసిక వైద్య నిపుణులు

సేవా పక్షంలో భాగస్వాములు కావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 17న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని అక్టోబర్ 2వ తేదీ వరకు 15 రోజులపాటు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో సేవా పక్షం కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై, మహిళా మోర్చా ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయిలో చిత్రలేఖనం నిర్వహించాలి. ఈ సేవా పక్షంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ సంఘసాని సురేష్, ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్ యాదవ్, రాజేందర్, శంకర్ గౌడ్, కన్వీనర్లు కో కన్వీనర్లు పాల్గొన్నారు.

మెదక్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

మెదక్‌జోన్: మెదక్‌లో మంగళవారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 14–17 బాలురకు వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ ప్రారంభించారు. అన్ని మండలాల నుంచి మొత్తం 502 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 90 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. క్రీడాకారులు చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని కోరారు.

విజేతలు వీరే: అండర్ 17 విభాగంలో చేగుంట, కౌడిపల్లి, అల్లాదుర్గం, అండర్ 14 విభాగంలో కౌడిపల్లి, పెద్దశంకరంపేట, హవేళిఘనాపూర్ జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, పీడీలు శ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, నరేష్ శ్రీనివాస్, దేవానంద్, దేవేందర్ రెడ్డి, కిషోర్ సుజాత, లతీఫా పాల్గొన్నారు.

కార్టూనిస్టుకు కీర్తి పురస్కారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటకు చెందిన కార్టూనిస్టు నెల్లుట్ల రమణారావుకు కీర్తి పురస్కారం దక్కింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి యేటా వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన వారికి కీర్తి పురస్కారంతో సత్కరిస్తుంది. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు.. కార్టూనిస్టు రమణారావుకు ఆహ్వానం పంపారు. ఈ నెల 23, 24 తేదీలలో విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోని ఎన్‌టీఆర్ కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

బైకును ఢీకొట్టిన కంటైనర్

- యువకుడు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: స్నేహితుడితో కలిసి వెళ్తుండగా బైకును కంటైనర్ ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడికి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిమాన్ సింగ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా చిన్న శంకర్‌పల్లికి చెందిన భాను ప్రకాష్ (25)ఎలక్ట్రీషియన్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అతని స్నేహితుడు బల్వంత్ రెడ్డితో కలిసి భోజనం చేసేందుకు బైక్‌పై ముత్తంగి బయలుదేరారు. ఈ క్రమంలో శివారులోకి రాగానే అర్ధరాత్రి కంటైనర్ వీరి బైక్‌ని ఢీ కొట్టింది. బైక్‌పై ఉన్న భాను ప్రకాశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బల్వంత్ రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి విజయ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బస్సును ఢీకొన్న కారు: ఇద్దరికీ గాయాలు

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని 161 జాతీయ రహదారి రాంపూర్ గ్రామం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం... సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పిట్లం వైపు వెళుతుంది. రాంపూర్ గ్రామం వద్ద ప్రయాణికులను దింపేందుకు బస్సు ఆపారు. వెనుక నుంచి పిట్లం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పిట్లంకు చెందిన సాయి, స్నేహిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సును కారు ఢీకొట్టడంతో పూర్తిగా నుజ్జునుజ్జైంది.

రేషన్ బియ్యం పట్టివేత



బుదేరా పోలీస్ స్టేషన్‌లో రేషన్ బియ్యం లారీ

మునిపల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నట్లు బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా.. రేషన్ బియ్యం లారీ పట్టుకున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి గుజరాత్‌కు బియ్యం తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. బియ్యం లారీని స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

చిట్టోజిపల్లిలో రైతు..



గోవర్ధన్

చేగుంట(తూప్రాన్): ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిట్టోజిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తలారి గోవర్ధన్(32) మంగళవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. విద్యుత్ సరఫరా కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోయిందని గుర్తించి వైరు సరి చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో గోవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

చిట్కుల్‌లో యువకుడు..



శివకుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిటుకల్ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కామగోల్ల శివకుమార్(28) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా గ్రామానికి చెందిన కొండారెడ్డి పొలం గట్లపై గడ్డి పెరగడంతో యంత్రంతో గడ్డి కోసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం గట్టుపై బోరుమోటార్‌కు కనెక్షన్ ఉన్న సరీస్ వైరును గమనించని అతడు వైరును కూడా కట్ చేయగా విద్యుత్ షాక్‌కు గురై పొలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నర్సింహులు, ఇన్‌చార్జ్ విద్యుత్‌శాఖ ఏఈ సల్మాన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కాగా మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహం జరిగింది.

మందపైకి దూసుకెళ్లిన వాహనం

- తొమ్మిది గొర్రెలు మృత్యువాత
- గిర్మాపూర్ వద్ద ఘటన

వర్గల్(గజ్వేల్): గొర్రెల మందపై డీసీఎం వ్యాను దూసుకెళ్లడంతో తొమ్మిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మంగళవారం వర్గల్ మండలం గిర్మాపూర్ శివారులో జరిగింది. గ్రామస్తులు, బాధిత గొర్రెల కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటిపల్లికి చెందిన బొమ్మ పెదపాపయ్య తదితరులకు చెందిన గొర్రెల మంద గిర్మాపూర్ పరిసరాల్లో మేతకు వెళ్లి తిరిగొస్తోంది. ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాను మంద పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తొమ్మిది గొర్రెలు మృత్యువాత పడగా, మరో పది వరకు గాయాలపాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుతెచ్చిన కాళోజీ

మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ కలెక్టరేట్: తన కవిత్వంతో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వ్యక్తి కాళోజీ నారాయణరావు అని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కాళోజీ రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపొందిచేలా ఉంటాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో డీఆర్‌ఓ భుజంగరావు పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.



జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలు

13న జాతీయ లోక్ అదాలత్

ఈనెల 13న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. ప్రజలు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు సత్యనారాయణ

వెల్దుర్తి(తూప్రాన్) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అందుగులపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఫాం సత్యనారాయణ(40), సునీతలు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. సత్యనారాయణ వ్యవసాయంతో పాటు తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన మూడు రోజుల క్రితం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నారాయణఖేడ్: వెంకటాపూర్ గ్రామ శివారులో మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మేకల సంతుకు చెందిన పాడిగేదె విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందగా.. దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

వ్యక్తిని ఢీ కొట్టిన బైక్

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కొడిపల్లి ముత్రాజ్‌పల్లికి చెందిన పరమేశ్ శివ్వంపేట వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా టిక్యాదేవమ్మగూడం తండాకు చెందిన బిక్యా బైక్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తూప్రాన్–నర్సాపూర్ హైవే చిన్నగొట్టిముక్ల తండా వద్ద జరిగింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.

రైతుల ఇబ్బందులు తొలగించాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: రైతులకు యూరియా అందించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక రైతు వేదిక వద్దకు వెళ్లిన సునీతారెడ్డికి రైతులు తమ ఇబ్బందులను వివరించారు. నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నా ఒక్క బస్తా యూరియా దొరకలేదని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. యూరియా దొరకనందున పంటలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్నారని, మాజీ సీఎం కేసీఆర్ సమర్థవంతంగా రాష్ట్రానికి యూరియా తీసుకురాగలిగారని, రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడలేదని ఆమె చెప్పారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం నుంచి యూరియా తేవడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులు యూరియా కోసం ఇబ్బందుల పాలవుతున్నారని ఆరోపించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్‌తోపాటు వ్యవసాయాధికారులతో మాట్లాడి నర్సాపూర్‌కు అవసరం మేరకు యూరియా సరఫరా చేయాలని కోరారు. రైతులకు ప్రాధాన్యత పద్ధతిలో యూరియా అందజేయాలని మండల వ్యవసాయాధికారి దీపికకు సునీతారెడ్డి సూచించారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న సునీతారెడ్డి

దాడికి పాల్పడిన ముగ్గురికి జైలు

సిద్దిపేటఅర్బన్: భూ తగాదాలతో భార్యాభర్తలపై దాడి చేసిన ముగ్గురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం... నాంచారుపల్లి గ్రామానికి చెందిన దూలం రాజేశ్వరి, రాజయ్య దంపతులకు చెందిన వ్యవసాయ భూమిని దాయాదులైన దూలం చిన్న రాజు, దూలం స్వామి, దూలం రామవ్వ కలిసి 2014లో అక్రమంగా ట్రాక్టర్‌తో దున్నసాగారు. దీంతో ట్రాక్టర్‌కు అడ్డుగా వెళ్లిన రాజేశ్వరిని కొట్టి పక్కకు తోసివేశారు. రాజయ్యను గొడ్డలితో చెయ్యిపై కొట్టగా చేయి విరిగింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా మంగళవారం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సాధన నేరస్తులపై నేరం రుజువు కావడంతో 18 నెలల సాధారణ జైలు శిక్షతోపాటు రూ. 4500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీస్ అధికారులు, అసిస్టెంట్ పీపీ, కోర్టు కానిస్టేబుల్స్‌ను సీపీ అభినందించారు.

సమాజ మార్గదర్శకులు గురువులే

డీఈఓ రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): ఉపాధ్యాయులు నవ సమాజ మార్గదర్శకులని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. పాపన్నపేటలో మంగళవారం జరిగిన మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదర్శవంతమైన సమాజాన్ని తయారు చేసే శక్తి ఉపాధ్యాయునికే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, క్రీడాకారులు, సైంటిస్టులుగా దేశానికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాపన్నపేట మండల స్థాయిలో విశిష్ట సేవలు అందించిన 28 మంది టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. వీరితోపాటు మండలం నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సాయిసిరికి, జిల్లా స్థాయికి ఎంపికైన సాయిలు, చంద్రశేఖర్, మల్లేశం, దుర్గా ప్రసాద్‌లకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, డీఎస్‌ఓ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు మహేశ్వర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



పాపన్నపేట మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మీరెందుకు నివాసం ఉండటం లేదు

- 120 మంది డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు నోటీసులు
- తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఆందోళన
- తిరిగి విచారణ జరిపిస్తాం: ఆర్డీఓ

జోగిపేట(అందోల్): అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని డబుల్‌బెడ్ రూంలను అద్దెలకు ఇచ్చారని, కొంతమంది విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలపై రెవెన్యూ అధికారులు 120 మందికి నోటీసులు జారీ చేశారు. తమకు కేటాయించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లో ఎందుకు నివాసం ఉండటం లేదు అన్న విషయమై మూడు రోజుల్లో లబ్ధిదారులు వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసులను తాళం వేసి ఉన్న గదులకు అతికించారు. ఈ విషయం తెలుసుకున్న లబ్దిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాము డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లోనే ఉంటున్నామంటూ లిఖిత పూర్వకంగా రెవెన్యూ అధికారులకు అందజేశారు.



అందోలు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

తహసీల్దారు, ఆర్డీఓ కార్యలయం ఎదుట ఆందోళన

డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఉద్దేశపూర్వకంగానే అధికారులు నోటీసులు అతికించారని సీఐటీయూ నాయకులు విద్యాసాగర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పి.నారాయణ, రఫీక్ ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం లబ్ధిదారులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. తాము లేని సమయంలోనే నోటీసులు అతికించారని పలువురు లబ్ధిదారులు సూచించారు.

మళ్లీ విచారణకు ఆర్డీఓ ఆదేశం

డబుల్‌బెడ్ రూం ఇళ్లను అద్దెకు ఇచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై తిరిగి విచారణ జరిపిస్తామని ఆర్డీఓ పాండు సూచించారు. వాస్తవంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లో నివాసం ఉంటే ఇబ్బంది లేదని, తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లను అమ్ముకున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఏఈఓ



రాజశేఖర్ గౌడ్

కొల్చారం(నర్సాపూర్): హైదరాబాదులోని జింఖానా గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్–2025 రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో మండలంలోని రంగంపేట ఏఈఓగా పనిచేస్తున్న రాజశేఖర్ గౌడ్ 400 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఉత్తరాఖండ్ (డెహ్రాడూన్) లో జరిగే జాతీయస్థాయి సెలక్షన్ కోసం జరిగే పోటీల్లో రాష్ట్రం తరఫున 200, 400 మీటర్ల విభాగంలో ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయస్థాయికి ఎంపికైన రాజశేఖర్ గౌడ్‌ను ఏఓ శ్వేత, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

పురస్కారానికి ఎంపికైన డాక్టర్ సూర్యప్రకాశ్ రావు



నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని కాగజ్ మద్దూరు గ్రామ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు ధర్మనిధి పురస్కారానికి ఎంపికయ్యాడు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతి ఏటా విద్యాభివృద్ధిలో విశేష సేవలందించే ఉపాధ్యాయులను గుర్తించి వారిని ఎంపిక చేస్తుంది. ఈ ఏడాది ఆయనను ఎంపికయ్యారు. బాల్యం నుంచే సాహిత్య కృషి చేస్తున్న ఆయన కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, సాహిత్య సంస్థల నిర్వాహకుడిగా సాహిత్య సేవ చేస్తున్నారు.

11న ఉద్యోగ మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఈ నెల 11న గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం విశ్వేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక మహీంద్ర అండ్ మహీంద్ర లిమిటెడ్ ఆటోమోటివ్ కంపెనీలో అప్రెంటీస్ ప్రాతిపదికన 200 మంది యువతను తీసుకొంటారని చెప్పారు. 18–25 సంవత్సరాల వయసు కలిగిన వారు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ పాస్ అయిన వారు ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. విద్యార్హత జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్ సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలని చెప్పారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

మునిపల్లి(అందోల్): గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 600 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ వివరాలు వెల్లడించారు. మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ నుంచి హైద్రాబాద్ వైపు వెళ్తున్న ఆటోలో నలుగురు 600 గ్రాముల ఎండుగంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గంజాయి తరలిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఫవాద్, సయ్యద్ జహీర్, అద్నాన్ హుసేన్, మహమ్మద్ అఫ్సర్ కిషన్ బాగ్ ను అదుపులోకి తీసుకున్నారు. వారు బీదర్‌లో ఇరాన్ గల్లిలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 600 గ్రాముల ఎండుగంజాయిని కొనుగోలు చేశారని, వారి నుంచి రెండు సెల్ పోన్లు స్ధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ రాజేశ్ తెలిపారు. ఏఎస్ బక్కన్న, కానిస్టేబుల్ హనీఫ్, డ్రైవర్ అహ్మద్ పాషాను కొండాపూర్ సీఐ సుమన్ కుమార్ అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలోని ఏకలవ్య ఫౌండేషన్ ఆగ్రో రైతు సంఘంలోని ఫర్నిచర్ ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన వీరారెడ్డి, అతని కుమారుడు రాంచంద్రరెడ్డి ఆగ్రో రైతు సంఘంలోకి ప్రవేశించి సీఈఓని దుర్భాషలాడుతూ ఫర్నిచర్ ధ్వంసం చేశారన్నారు. సీఈఓ రాజేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పాము కాటుతో మహిళ మృతి



బాలమణి

చేగుంట(తూప్రాన్): పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేషన్ బాలమణి(52) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని పాము కాటు వేసింది. గమనించిన బాలమణి తన కుమారుడికి తెలియజేయగా స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బాలమణి మృతి చెందింది. మృతురాలి కుమారుడు శరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.